## ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్
- గచ్చిబౌలిలో 'ఓటరు చైతన్య 5కే రన్'



గచ్చిబౌలి స్టేడియంలో 'ఓటరు చైతన్య 5కే రన్'ను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్. చిత్రంలో డీజీపీ అంజనీకుమార్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి తదితర ప్రముఖులు

శేరిలింగంపల్లి, నవంబర్ 25 : కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ప్రలోభాలకు గురవ్వకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో 'లెట్స్ ఓట్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఓటరు చైతన్య అవగాహన 5కే రన్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డిలతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా ప్రాముఖ్యత కలిగినదన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఓటు ప్రాముఖ్యతను గుర్తించి అర్హులైన అందరూ ఎన్నికల్లో ఓటు వేసేలా చైతన్యపర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 30వ తేదీన ఎన్నికల సెలవు ఇంట్లో ఉండేందుకు కాదని, బయటకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకని సూచించారు. స్వచ్ఛందంగా ఓటు వేసి మనందరం దేశం పట్ల ప్రేమ, అభిమానం చాటుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బాధ్యతాయుత పౌరులుగా యువతీయువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వివిధ ఐటీ సంస్థల ఉద్యోగులు, పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నేడు యూపీఎస్సీ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలు

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (మెయిన్) పరీక్షలను ఈ నెల 26న జిల్లాలో నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి కలెక్టరేట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ఈ నెల 17 నుంచే యూపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే ప్రక్రియ కొనసాగుతుందని, మెయిన్ పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభం కావడానికి 30 నిమిషాలు ముందుగానే గేట్లు బంద్ చేస్తామన్నారు. ఫారెస్ట్ సర్వీసు పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులు తప్పకుండా హాల్‌టికెట్లు తెచ్చుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో పేర్కొన్న నిబంధనలు తెలుసుకుని పరీక్షలకు హాజరుకావాలని యూపీఎస్సీ అధికారులు అభ్యర్థులను సూచించారు.



### జూబ్లీహిల్స్‌లో నమ్రతా సందడి


జూబ్లీహిల్స్ రోడ్ నం.36లో నూతనంగా ఏర్పాటు చేసిన డిజైనర్ స్టోర్‌ను ప్రముఖ సినీనటి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ శనివారం ప్రారంభించి సందడి చేశారు. – బంజారాహిల్స్, నవంబర్ 25


### టెన్షన్..టెన్షన్..!!

*సరిపడా నిద్ర, తిండి లేకపోతే అనారోగ్యం*

# అభ్యర్థులూ జర జాగ్రత్త..

- ఒత్తిడితో సతమతమవుతున్న అభ్యర్థులు
- రెయింబవళ్లు ప్రచారంపైనే దృష్టి
- వైద్యులను సంప్రదిస్తున్న అభ్యర్థులు
- యోగా, మెడిటేషన్ చేయాలని సూచిస్తున్న డాక్టర్లు





సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : గెలుపు..ఓటమి..! పోటీ అన్నాక ఇందులో ఏదో ఒకటి పొందాల్సిందే. అది గెలుపులో కావొచ్చు.. ఓటమీ కావొచ్చు. ఇది తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన ఫలితం. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల సమరం నడుస్తున్నది. అమీతుమీ తేల్చుకోవడానికి అభ్యర్థులు శక్తికి మించి శ్రమపడుతున్నారు. నెలన్నరగా అభ్యర్థులు ప్రచారంలో బిజీగా ఉన్నారు. కంటి మీద కునుకు లేకుండా కార్యకర్తలతో సమావేశాలు, ఇంటింటి ప్రచారం, నాయకుల మీటింగ్‌లు ఇలా సవాలక్ష పనులను చక్కబెట్టాల్సిన పరిస్థితి వారిది. ఇప్పుడు ఈ బిజీలైఫ్ వారిలో కొత్త తలనొప్పులను తీసుకొస్తున్నది. సరిపడా నిద్ర లేక గ్రేటర్‌లోని కొంతమంది అభ్యర్థులు తెగ ఇబ్బంది పడుతున్నారని ఓ వైద్యుడు చెప్పారు. ఒత్తిడితో సతమతమవుతున్నారని తెలిసింది. ఇదివరకే షుగర్, బీపీలున్న కొంత మంది అభ్యర్థులకు అనారోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ప్రచారం మొదలైనప్పటి నుంచి తీరిక లేకుండా సమయానికి తిండి సరిగా తినకుండా ప్రజల్లో తిరుగుతూ.. ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి పలకరిస్తూ కాలినడకన సాగుతున్నారు. రాత్రి ప్రచారం ముగిసినా కూడా ముఖ్య నేతలతో టెలీ కాన్ఫరెన్స్‌లు, రహస్య మీటింగ్‌లతో మళ్లీ బిజీ అవుతున్నారు. అవన్నీ పనులు ముగించుకుని ఇంటికొచ్చే సరికి అర్ధరాత్రి 2 దాటుతుందని ఓ అభ్యర్థి కుటుంబసభ్యులు తెలిపారు. మళ్లీ మరుసటి రోజు సేమ్ టైంటేబుల్. ఇలా వరుసగా బిజీగా గడుపుతుండటమే వారి అనారోగ్యానికి కారణమైందని వైద్యులు చెబుతున్నారు.

### కూల్.. కూల్.. కూల్..!

ఇప్పుడు అందరిని కలవరపెడుతున్నది గెలుపు. గెలుస్తానా? లేదా?.. డబ్బులు ఖర్చు పెడుతున్నాను? ఓట్లు వేస్తారా? లేదా?.. అనే సవాలక్ష అనుమానాలతో అభ్యర్థులు టెన్షన్‌కు గురవుతున్నారు. ఒత్తిడితో మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. కాళ్లు, నడుము నొప్పులతో బాధపడుతున్నారని సమాచారం. ఇలాంటి సమయంలో కొంతమంది అభ్యర్థులు వైద్యులను సంప్రదించి సూచించిన పరీక్షలు సైతం చేయించుకుంటున్నారు. వైద్యుల సూచనలతో పాటు కాసేపు యోగా, మెడిటేషన్ చేస్తున్నారు. తప్పనిసరిగా యోగా చేయకుండా ప్రచారానికి వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించాలని చెబుతున్నారు.

## మిల్లెట్లతోనే పోషకాహార లోపం దూరం




**ఎన్ఐఎన్‌లో న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సులలో పలువురు సైంటిస్టులు**

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): దేశాన్ని పట్టిపీడిస్తున్న పోషకాహార లోపం సమస్యను అత్యధిక పోషకాలు కలిగిన మిల్లెట్లతోనే దూరం చేయవచ్చని పలువురు ఆహార నిపుణులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థలో న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సును ఎన్ఐఎన్ డైరెక్టర్ డా.హేమలతతోపాటు పలువురు ప్రముఖ సైంటిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలో ఆహార పంటల ఉత్పత్తి, పోషక విలువలు, అనారోగ్య సమస్యలు, మిల్లెట్లలోని పోషకాలు, వాటి వినియోగం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. పలువురు సైంటిస్టులు ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపం, పోషకాహారం ప్రాధాన్యత వంటి అంశాలపై చర్చించారు. తొలి రోజు జరిగిన కార్యక్రమంలో ఆర్.హేమలత, నీతి అయోగ్ సలహాదారులు నీలం పటేల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఎ.లక్ష్మయ్య, ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ డా. శశికిరణ్, డా. బి.దినేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కమ్యూనిటీ న్యూట్రిషన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్, న్యూట్రిషన్ పాలసీ రీసెర్చ్, ఎక్సపర్మెంటల్ న్యూట్రిషన్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, న్యూట్రిషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్, క్లినికల్ న్యూట్రిషన్ వంటి విభాగాలపై పరిశోధకులు, 50కిపైగా పరిశోధన పత్రాలు, 350కి పైగా రీసెర్చ్ పోస్టర్లను సదస్సులో ఆవిష్కరించారు. వీటితోపాటు ప్లీనరీ సెషన్లు, యంగ్ సైంటిస్టు అవార్డులతో సత్కరించారు. కాగా, రెండ్రోజుల పాటు జరిగే సమావేశంలో 1300మందికి పైగా విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, న్యూట్రిషన్ నిపుణులు, సైంటిస్టులు పాల్గొన్నారు.

## ఐబీఎస్ వేదికగా స్పోర్ట్స్ మీట్

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ వేదికగా జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్ జరగనున్నది. డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించేందుకు ఇక్ఫాయ్ ఏర్పాట్లు చేసింది. అవేజ్ – 14 పేరిట నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు దేశంలోని 500కుపైగా బిజినెస్ స్కూల్ విద్యార్థులు హాజరు కానున్నారు. శంకర్‌పల్లి సమీపంలో గల ఇక్ఫాయ్ బీ స్కూల్ క్యాంపస్ ప్రాంగణంలో ఈ పోటీలు జరగనున్నాయి.



### చేనేత మేళా భళా!

గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాలులో కొలువుదీరిన హ్యాండ్ టూ హ్యాండ్–సంప్రదాయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. దేశంలోని 14 నగరాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తీసుకొచ్చిన తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, పంచలు తదితర రకాల వస్త్ర ఉత్పత్తులు కొలువుదీరాయి. చేనేత మేళా ఈనెల 29వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

*– సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)*

## భక్తి గీతాలను భవిష్యత్ తరాలకు అందించాలి



భక్త రామదాసు కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్యార్థులు

రవీంద్రభారతి, నవంబర్ 25: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, కోదండపాణి సంగీత విద్యా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో అంతా రామమయం భక్త రామదాసు కీర్తనల ప్రచార యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి దాదాపు 300 మంది విద్యార్థులచే భక్త రామదాసు సంకీర్తనలు ఆలపింపజేశారు. అనంతరం డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. భక్త రామదాసు కీర్తనల కోసం కోదండపాణి సంగీత విద్యా సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చి రవీంద్రభారతిలో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో సంస్థ అధ్యక్షురాలు సంగీత కళా రాజ్యలక్ష్మి (సంగీత సిస్టర్స్) భక్తిగీతాలను భవిష్యత్ తరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. సభకు ముందు సంగీత విద్యార్థులు ఆలపించిన భక్త రామదాసు కీర్తనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో జి.రాజేందర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షురాలు సంగీత రాజ్యలక్ష్మి (సంగీత సిస్టర్స్) కిష్టవేణి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.